## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజు వసూలు చేస్తూ పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పాఠశాలలు నడుపుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తూ అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయించకూడదని, ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకొని పాఠశాలలను సీజ్ చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి, జిల్లా నాయకులు జగదీష్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వరి విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర - గొలుగొండ: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గజ్జలపు మణి కుమారి అన్నారు. గురువారం మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి సుధారాణి, మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పలువురు సర్పంచులు, రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నర్సీపట్నం: మండలంలోని ధర్మసాగరం గ్రామంలో రాయితీపై వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీదేవి మాట్లాడుతూ మండలానికి 658 క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చినట్టు చెప్పారు. ప్రతి రైతు నూతన వరి వంగడాలను పొలాలలో వేసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సకల రమణమ్మ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తూ పంట దిగుబడి అధికంగా సాధించాలని ఆకాంక్షించారు. రైతులకు ఎల్లప్పుడూ వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. ఎంఏఓ అప్పారావు మాట్లాడుతూ మండలంలో 10 రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొంప కన్నయ్య నాయుడు, చెట్టుపల్లి గ్రామం నుంచి గజాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన వైసీపీ మాజీ కౌన్సిలర్

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ జోగినాధుని పాలెంకు చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ వర్రే శ్రీనివాసరావు అతని అనుచరులతో కలిసి గురువారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర వారందరికీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ డాక్టర్ కోన నారాయణరావు, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగబళ్ల శివ, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, మాకవరపాలెం అధ్యక్షులు సేనాపతి శేషు, నర్సీపట్నం రూరల్ అధ్యక్షులు మోపాద చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యేకు భారీ స్వాగత ఏర్పాట్లు

విశాలాంధ్ర - యలమంచిలి: ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన సుందరపు విజయ్ కుమార్ మొట్టమొదటిసారిగా ఆదివారం నియోజకవర్గానికి చేరుకుం టున్నారని దీనికోసం యలమంచిలి నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, బిజెపి నాలుగు మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హరి పురంలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు యలమంచిలి రూరల్ పులపర్తి జంక్షన్ నుండి ఎమ్మెల్యే చేరుకుంటారని వారితోపాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కూడా చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా వయా యలమంచిలి, వెంకటాపురం జంక్షన్ మీదుగా అచ్యుతాపురంలోని పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌కు చేరుకుంటారని, అక్కడ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి అత్యధికంగా తరలిరావాలని, అలాగే బైకులతో ఉదయం 8 గంటలకు పులపర్తి జంక్షన్‌కు విచ్చేసి బైకు ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జ్ రాజాన సన్యాసి నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, అచ్చుతాపురం జనసేన మండల పార్టీ అధ్యక్షులు బైలపూడి రామదాసు, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, రాంబిల్లి తెలుగుదేశం అధ్యక్షులు దిన్బాబు, రాంబిల్లి జనసేన అధ్యక్షులు పప్పల నూకన్నదొర, మునగపాక జనసేన అధ్యక్షులు టెక్కలి పరశురాం, మునగపాక తెలుగుదేశం అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, సీతపాలెం బుజ్జి తదితర నాయకులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరం

విశాలాంధ్ర - చోడవరం: మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు వినియోగం ఆరోగ్యానికి హానికరమని, సమాజానికి దుష్ప్రభావమని చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఎల్.వినయ్ కుమార్ తెలియజేసారు. మాదకద్రవ్యాలు - చెడు ఫలితాలపై చోడవరం ఎక్సైజ్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్స్పెక్టర్ బి.హెచ్.కిరణ్ మనేశ్వరి ఆధ్వర్యంలో ఉషోదయ డిగ్రీ కళాశాలలో గురువారం యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వినయ్ కుమార్ మాట్లాడుతూ ఎదిగే వయస్సులో మత్తు, మాదక ద్రవ్యాలు అలవాట్లు కారణంగా భావి జీవితం నాశనమయ్యే ప్రమాదం ఉందన్నారు. కొందరి దురలవాట్లు కారణంగా సమాజం చెడిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ కౌన్సిలర్ ఎం.శ్రీనివాస్, సెబ్ ఇన్స్పెక్టర్ లు కిరణ్ మనేశ్వరి, పి.అప్పారావు ఉషోదయ డీన్ శ్రీనాథు వాసు, యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వీపీఏ అధికారులను అభినందించిన కేంద్ర పోర్టులు నౌక, జల రవాణా శాఖ మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్ పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తును కేంద్ర పోర్టులు నౌక, జల రవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ హృదయ పూర్వకంగా అభినందించారు. కేంద్ర పోర్టులు నౌకా జల రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని మేజర్ పోర్టుల చైర్ పర్సన్స్ ఇతర సంస్థల ప్రతినిధులతో కేంద్ర మంత్రి ఢిల్లీలో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పోర్టు సాధించిన ఘనత పట్ల కేంద్ర మంత్రి ప్రశంసల జల్లు కురిపించారు. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో పోర్టు 20వ స్థానం, కంటైనర్ పోర్ట్ పర్ఫామెన్స్ ఇండెక్స్‌లో 19వ స్థానం సాధించడం చైర్ పర్సన్ యొక్క నాయకత్వ లక్షణానికి, విశాఖ పోర్టు వ్యూహాత్మక దృష్టికి అద్దం పడుతోందని అన్నారు. ఇతర పోర్టులు కూడా విశాఖ పోర్టులో చేపడుతున్న పనులను అనుకరించడం ద్వారా తమ పోర్టులను కూడా అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళవచ్చని సూచించారు. విశాఖపట్నం పోర్టు ప్రగతిలో కేంద్ర మంత్రిత్వ శాఖ తన వంతు సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. పోర్టు ప్రపంచ ర్యాంకింగ్ సాధించడంలో మన సిబ్బంది యొక్క కష్టించే తత్వం, అంకితభావం, నిబద్ధతను తెలియజేస్తున్నాయని అన్నారు. వ్యాపార భాగస్వాములకు అవసరమైన సేవలను ఉన్నతమైన ప్రమాణాలతో అందించడం ద్వారా విశాఖ పోర్టును అంతర్జాతీయ స్థాయిలో మంచి స్థితిలో ఉంచుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబె, కార్యదర్శి టి.వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

## పౌర సరఫరాల శాఖ గిడ్డంగులపై ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్లో ఉన్న పౌర సరఫరాల శాఖ గిడ్డంగులపై అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పౌర సరఫరాల శాఖలో ప్రజలకు సరఫరా అవుతున్న కంది పప్పు, పంచదార, ఆయిల్ ప్యాకెట్లు వేయింగ్ వేయడం జరిగింది. ఈ తనిఖీల్లో కందిపప్పు 500 గ్రాములకు బదులుగా 450 గ్రాములు ఉండడంపై కేసు నమోదు చేశారు. ఇకపై ప్రతి నెల విధిగా తనిఖీలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే సరుకులు ప్రజలకు నిష్పక్షపాతంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## గొల్లలపాలెంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యటన

విశాలాంధ్ర - యలమంచిలి: మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు పెదగొల్లలపాలెం గ్రామంలో పేరుకుపోయిన డ్రైనేజీలను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనువాసరావు గురువారం పరిశీలించారు. పనులు త్వరితగతిన చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి కోర్ కమిటీ సభ్యులు పల్లా సత్య నారాయణ, టిడిపి, జనసేన నాయకులు నమ్మి రమణ, దేముడు, మాణిక్యం, లోవ రాజు, తాతాజీ, చిరంజీవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటిపారుదల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - యలమంచిలి: నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ విజయవాడ సెక్రటేరియట్‌లో గురువారం నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం యలమంచిలి నియోజకవర్గంలో ఉన్న శారదా నది డ్యాము గురించి మంత్రికి వివరించడం జరిగిందని, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## పల్లాను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - యలమంచిలి: సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలోని అత్యధిక మెజార్టీ సాధించిన గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ధూళి రంగనాయకులు, యలమంచిలి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొండా జగన్, రాంబిల్లి మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, నాగరాజు, రాంబిల్లి మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు కోన అప్పలనాయుడు పాల్గొన్నారు.

## వేంపాడులో యోగా డే చైతన్య ర్యాలీ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలోని వేంపాడు గ్రామంలో గురు వారం ప్రపంచ యోగా డే చైతన్య ర్యాలీ జరిగింది. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో యోగా చేద్దాం-ఆరోగ్యంగా వుందాం అనే నినాదాలను విద్యార్థులు చేశారు. ఈ నెల 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకుని అన్ని పాఠశాలల్లో యోగా డే కార్యక్రమాలు చేస్తున్నట్టు యోగా ట్రైనర్ డి.రాంబాబు చెప్పారు. ఈ ర్యాలీలో వేంపాడు హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం రవికుమార్, పీడీ రాం కుమార్, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, శివ రామకృష్ణ. ఆయుష్ సిబ్బంది నర్సమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ బీజేపీ మండల అధ్యక్షుడు సందక గౌరీ నాయుడు 10వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఏఎల్ పురం బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి యువత భారీగా తరలివచ్చి 62 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గౌరీ నాయుడు దంపతులు విద్యార్థులకు యూనిఫారాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ అధ్యక్షులు పన్నుపు అప్పారావు, పార్లమెంట్ ఇన్చార్జి వర్మ రాజు, పట్టా ప్రసాద్, తోడు ట్రస్ట్ సభ్యులు, మదర్ బ్లడ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - నర్సీపట్నం: ఇటీవల మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి ఎంపీ సీఎం రమేష్ ఆర్థిక సహాయం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గ మాకవరపాలెం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త నమ్మి సత్తిబాబు ఇటీవల అకాల మరణం విషయం తెలుసుకున్న అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఎన్నికల్లో క్రియాశీలకంగా కూటమి నాయకులతో అభ్యర్థుల విజయానికి కృషి చేసిన సత్తిబాబు మరణం తీవ్ర బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల దగ్గరకు బిజెపి యువమోర్చా జిల్లా అధ్యక్షులు గేదల స్వరూప్‌ను వారి స్వగృహమునకు పంపించి 30వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించిన అనంతరం మృతుని కుమార్తె రెండో తరగతి చదువుతుందని తెలుసుకున్న సీ.ఎం రమేష్ భవిష్యత్తులో కుమార్తె చదువు నిమిత్తం పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా అండగా నిలుస్తామని, వారిని ధైర్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కచ్చళ్ళ గణేష్, మాకవరపాలెం మండల అధ్యక్షులు సేనాపతి శేషు, నానాజీ పాల్గొన్నారు.

### వైభవంగా బంగారు తల్లి పండగ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో శ్రీ బంగారు తల్లి పండగ వైభవంగా జరిగింది. గురు వారం గ్రామంలోని వరాహ నది ఒడ్డున ఉన్న బంగారు తల్లి గుడికి గ్రామంలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### యోగా నమూనా ప్రదర్శన

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగ ఆకారంలో ఉండే బొమ్మను నమూనా ప్రదర్శన చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు కుందూరు రాజు ఆధ్వర్యంలో యోగ గుర్తును విన్యాసాన్ని ప్రదర్శిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మహేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అప్పికొండమ్మ పండగ

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గురువారం గ్రామ దేవత అప్పికొండమ్మ పండగను ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులందరికీ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందించారు. భారీ ఎత్తున అన్న సమరాధనా కార్యక్రమం నిర్వహించారు.

### డ్రైనేజీ కాలువ పనులకు శంకుస్థాపన

విశాలంధ్ర - అచ్యుతాపురం: ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు అన్నారు. గురువారం ఆయన కొత్త రామన్నపాలెంలో డ్రైనేజీ కాలువ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధర్మిరెడ్డి సన్యాసినాయుడు (బాబు), ఉప సర్పంచ్ ధర్మిరెడ్డి లక్ష్మి, లాలం సత్తిబాబు, దర్మిరెడ్డి శ్రీను, తాతబాబు, సత్యనారాయణ, గోవింద్, వెంకునాయుడు, అనిల్ కంద్ర రేవతి, డ్రీమ్స్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

## డైట్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ తన కొత్త బ్యాచ్ డిప్లొమా విద్యార్థులను సంస్థ యొక్క దృష్టి, లక్ష్యం, విలువలతో పరిచయం చేయడానికి ఉద్దేశించిన ఓరియ ంటేషన్ ప్రోగ్రామ్‌తో స్వాగతించింది. క్యాంపస్ వాతావరణం, విద్యా పరమైన అంచనాలు, పాఠ్యేతర అవకాశాలతో ఫ్రెషర్‌లకు పరిచయం చేయడానికి ప్రోగ్రామ్ రూపొందించ బడింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల నుండి తెలివైన చర్చలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, ఐస్ బ్రేకింగ్ కార్యకలాపాలు ఉన్నాయి. లైబ్రరీ సౌకర్యాలు, విద్యార్థి కౌన్సెలింగ్ ప్లేస్‌మెంట్ సహాయం వంటి సంస్థ యొక్క సహాయ సేవలను కూడా విద్యార్థులు పరిచయం చేశారు. ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ దాడి రత్నాకర్ ప్రేరణ ప్రసంగంతో కార్యక్రమం ముగిసింది. విద్యార్థులు తమ విద్యా ప్రయాణాన్ని ఉత్సాహంగా, అంకితభావంతో ఆదరించాలని ప్రోత్సహించారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభివృద్ధి పట్ల చూపే గంభీరత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. డిప్లమో ప్రిన్సిపాల్ డా.దుర్గా శ్యామ్ ప్రసాద్ తన ప్రసంగంలో విద్యార్థుల సమగ్ర వికాసానికి సంస్థ అందిస్తున్న అకడమిక్ సహాయాన్ని గురించి మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.ఆర్.వైకుంఠరావు, అకడమిక్ కోఆర్డినేటర్ ఎ.కృష్ణనాగ్, డిప్లొమా కోఆర్డినేటర్ ఎన్.సరితా రాణి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పరవాడలో దుర్గమాంబ పండగ

విశాలాంధ్ర - పరవాడ: పరవాడలో శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఆలయ ధర్మకర్త పైలా పోతునాయుడు తదితరులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు పైలా సన్యాసిరావు మాస్టర్, పైలా రామ చంద్రరావు, పూజారి పైలా నరసింగరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు పైలా హరీష్, పోతల అప్పలనాయుడు, నాయకులు వర్రి, పైల పైడం నాయుడు(గరగ), పైన అప్పారావు, పైల ప్రసాద్, పైల కృష్ణ, బండారు రాజు, చుక్క గోపి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: బుచ్చియ్యపేట మండలం కోమళ్లపూడి అంగన్వాడీ చిన్నారులచే గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడి పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల్ని స్కూలుకి పంపించడానికి వీడ్కోలు పలుకుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలని అంగనవాడీకి స్వాగ తిస్తూ ఈ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్టు తెలిపారు. కోమళ్లపూడి సచివాలయం పరిధిలో 5 మంది, లోపూడి సచివాలయం పరిధిలో 21 మంది, విజయరామరాజుపేట సచివాలయ పరిధిలో 10 మంది ఐదు సంవత్సరాల నిండిన పిల్లలను స్కూలుకి పంపించామని తెలిపారు. అలాగే కోమళ్లపూడి సచివాలయ పరిధిలో మూడు సంవత్సరాలు నిండిన ఆరు గురు మంది చిన్నారులను, లోపూడి సచివాలయ పరిధిలో 14, విజయ రామరాజుపేట సచివాలయ పరిధిలో ఎనిమిది మంది మూడు సంవత్స రాల నిండిన చిన్నారులను అంగన్వాడిలో చేర్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది ఏ.ధనలక్ష్మి, కుసుమకుమారి, జ్యోతి, లలిత, సత్య, నూకరత్నం, వరహాలమ్మ, లలిత, అంగన్వాడి హెల్పర్ నాగమణి పాల్గొన్నారు.